# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైన దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:216 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. 8 మంది మావోయిస్టులు హతం

రాయ్‌పూర్, మే 10 : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతం అయ్యారు. ఘటనాస్థలిలో భారీగా ఆయుధాలు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పిడియా గ్రామ సమీపంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసు బలగాలకు పక్కా సమాచారం అందింది. దీంతో అక్కడ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. మావోయిస్టులు తారసపడడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతం అయ్యారు. మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా బలగాలకు ఎవరికీ గాయాలు కాలేదు. ఇక పిడియా గ్రామ పరిసరాల్లో కూంబింగ్ కొనసాగుతోంది.

### చురక

ఎటుచూసిన దేశమంత
ఎన్నికల్లో తీవ్ర పోటి
పరుగుదీసె ప్రచారాలు
ప్రలోభాల ఎరను మీాటి.

కనిపించే ఎవరేమిటో
కళ్ల ముందు ప్రతీ సత్యం
విస్మరిస్తే జనం తీర్పు
విగత బతుకే ఇక నిత్యం



-వేల్పుల నారాయణ

## లక్షల కోట్లు విడుదల చేశారు... అవన్నీ అవినీతి పరుల పాలయ్యాయి- మోడీ



హైదరాబాద్, 10 :(నేటినిజం ప్రతినిధి): లక్షల కోట్లు విడుదల చేశారు. అవన్నీ అవినీతి పరుల పాలయ్యాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం ఆయన నారాయణపేట జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడుతూ తాను ఆర్ఆర్ ట్యాక్స్ విషయంలో ఎవరి పేరు చెప్పలేదని.. గుమ్మడికాయ దొంగ ఎవరంటే.. భుజాలు తడుముకున్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్ మీట్ పెట్టాడని, ఇక్కడే అసలు దొంగ బయటపడ్డాడని అన్నారు. మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తమ స్వార్థ రాజకీయాలకు వాడుకున్నారని, అభివృద్ధిని మరిచారని చురకలంటించారు.

పాలమూరుకు కృష్ణా, తుంగభద్ర నదుల ఆశీర్వాదం ఉందని.. సాగు నీటి ప్రాజెక్టులకు రూ.వేల కోట్లు ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదని తెలిపారు. దీంతో ఈ ప్రాంతం ప్రజలకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ రాకుమారుడు ఎన్నికలు రాగానే విద్వేషమనే విషాన్ని చిమ్ముతున్నాడని మండిపడ్డారు. రంగు ఆధారంగా ప్రజలను విభజించేందుకు కుట్రలు చేస్తున్నాడని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎప్పటికీ ఒక్కటేనని.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సీట్లు సాధించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నేతలు పదే పదే తమ ప్రసంగాల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లను ఎత్తివేస్తుందని ప్రచారం చేస్తున్నారు. దేశంలో హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చేయాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. మత పరమైన రిజర్వేషన్లను ఆనాడు అంబేద్కర్ కూడా వ్యతిరేకించారని ప్రధాని గుర్తుచేశారు. కులాల పేరిట, మతాల పేరిట దేశాన్ని కాంగ్రెస్ విభజించిందని మండిపడ్డారు.

దేశం గురించి కాంగ్రెస్‌కు ఏనాడూ పట్టింపులేదని.. రాజకీయ లబ్ది మాత్రమే పార్టీకి ముఖ్యం అని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లు ఇస్తే.. మతమార్పిడులు పెరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తమ స్వార్థానికి వాడుకున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతానికి కృష్ణా, తుంగభద్ర నదుల ఆశీర్వాదం ఉందన్నారు. మహబూబ్‌నగర్ ప్రాజెక్టులకు వేల కోట్లు ఇచ్చినా సద్వినియోగం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఉందని ఆవేదన చెందారు. ఇవేవీ కాంగ్రెస్ రాకుమారుడికి పట్టవని.. ఎన్నికలు రాగానే విద్వేష ప్రసంగాలు చేయడం మాత్రమే తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాకుమారుడి రాజగురువు మనల్ని రంగు ఆధారంగా విభజిస్తున్నారని కీలక ఆరోపణలు చేశారు. శరీర రంగును బట్టి దక్షిణ భారత్ వాళ్లు ఆఫ్రికన్లు అని మాట్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు హిందువులు అంటే గిట్టదని అన్నారు. హిందువుల పండుగలు అంటే ఏమాత్రం వారికి నచ్చదని తెలిపారు. తాను గుడికి వెళితే కూడా దేశ వ్యతిరేకమైన పనిచేస్తున్నానని విమర్శలు చేస్తున్నారని ఆవేదన చెందారు.

## తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్

హైదరాబాద్, మే 10 :తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. 2024-2025 విద్యా సంవత్సరం కోసం అడ్మిషన్లు కల్పించనున్నారు. పదో తరగతి అర్హత పొందిన అభ్యర్థులు ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. నేటి నుంచి ప్రవేశాల కోసం ఆన్ లైన్ లో అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ మే 31.

తెలంగాణ మోడల్ స్కూల్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల కోసం ప్రవేశాలు కల్పించనున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్ లలో అడ్మిషన్లు పొందవచ్చు.

పదో తరగతిలో అర్హత సాధించిన విద్యార్థులు మోడల్ స్కూళ్లలో ఇంటర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

**దరఖాస్తు విధానం: ఆన్ లైన్**

దరఖాస్తు ప్రారంభ తేదీ:మే 10, 2024

దరఖాస్తులకు చివరి తేదీ: మే 31, 2024

ఎంపిక విధానం: పదో తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా తుది జాబితా విడుదల చేస్తారు.

## ఆర్టీసి బస్సులో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ

### -పార్టీ మేనిఫెస్టో వివిధ పథకాల గురించి ప్రయాణికులకు వివరించిన రేవంత్



హైదరాబాద్ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేడు(శుక్రవారం) ఆర్టీసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు తమ పార్టీ మేనిఫెస్టో తాలూకు వివిధ పథకాల గురించి వివరించారు. రాహుల్ గాంధీ అయితే యువ న్యాయ్, కిసాన్ న్యాయ్, నారీ న్యాయ్, శ్రామిక్ న్యాయ్ వంటి పథకాల గురించి ప్రయాణికులతో ఇంటరాక్ట్ అయ్యారు.వారు దిల్ సుఖ్ నగర్ లో బస్సెక్కారు.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వంపై విజయం సాధించాక కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మహాలక్ష్మి ఉచిత బస్సు పథకాన్ని తెచ్చింది. ఈ పథకాన్ని గత ఏడాది డిసెంబర్ లో ఆరంభించారు. రాహుల్ గాంధీ మహిళలకు ఉచిత బస్సు పథకం పై ఇంటరాక్ట్ అవ్వడమేకాక, వారి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాహుల్ గాంధీ నిరుద్యోగం పెరిగిపోవడంపై ప్రధాని నరేంద్ర మోడీని విమర్శిస్తూ మాట్లాడారు. ఇదిలావుండగా తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరుగనున్నాయి.

## హైదరాబాద్ సిటీలో ఆంక్షలు-మూడు రోజుల పాటు మద్యం షాపులు బంద్

హైదరాబాద్, మే 10 :లోక్?సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్ సిటీలో ఆంక్షలను విధించారు. ఈ ఆంక్షలు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని హైదరాబాద్, రాచకొండ, సిటీ పోలీస్ కమిషనర్లు ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆ రూల్స్‌లో పేర్కొన్నారు. పోలింగ్ పరిధిలో అయిదుగురు కానీ, అంతకుమించి గుమిగూడొద్దని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకూ అన్ని రకాల ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు.

మూడు రోజులు మద్యం షాపులు బంద్

ఏ లైసెన్సు కింద అనుమతి ఉన్నా మద్యం విక్రయాలపై ఆంక్షలు ఉంటాయని పోలీసులు తెలిపారు. 13వ తేదీన పోలింగ్ కేంద్రానికి ఓటర్లు రెండు క్యూలైన్లలో ఉండాలని, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మాత్రమే ఉంటాయని తెలిపారు. రెండు కంటే ఎక్కువ లైన్లలో ఉండడాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని మూడు కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు హెచ్చరించారు.

మద్యం డ్రై డే కచ్చితంగా అమలు

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగిసినప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్? రాజ్ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు రోజున మద్యం దుకాణాలు తెరవరాదని స్పష్టం చేశారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. జూన్? 4న ఓట్ల లెక్కింపు రోజున సాయంత్రం 5 గంటల వరకు మూసి వేయాలని ఆదేశించారు. ఒకవేళ రీపోలింగ్ ఉన్నట్లయితే ఆ ప్రాంతంలో సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని వెల్లడించారు. మద్యం డ్రై డేను కచ్చితంగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖకు సీఈవో స్పష్టం చేసింది.

### ఆంక్షలు ఇవే..

అయిదుగురు మించకుండా ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటికి వెళ్లడానికి వీల్లేదు.

మైకులు, స్పీకర్ల ద్వారా పాటలు, ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించడం నిషేధం.

బహిరంగ ప్రదేశాల్లో షామియానాలు, పందిళ్లు వంటి తాత్కాలిక నిర్మాణాలకు అనుమతి లేదు.

వ్యక్తులు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం నిషేధం.

పోలింగ్ కేంద్రాలకు కిలోమీటరు దూరంలో కర్రలతో కూడిన జెండాలు, తుపాకులు, మారణాయుధాలతో సంచరించడం నిషేధం.

ఆత్మరక్షణ కోసం కర్రలు, తుపాకులు, మారణాయుధాలు వినియోగించడంపై నిషేధం.

మద్యం, కల్లు దుకాణాలు, బార్లు, మద్యం విక్రయించే అన్ని సంస్థలూ మూసేయాలి.

## అగ్నివీర్ పథకం దేశ రక్షణకు ప్రమాదకరం

### -ఆర్థిక విధానాల్లోనూ మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
### -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా నల్ల సాగు చట్టాలను మోడీ ప్రభుత్వం తీసుకరావడంతో కొన్ని నెలలపాటు రైతులు తీవ్రమైన ఆందోళన చేశాక ఆ చట్టాలను రద్దు చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే భర్తీ చేయలేదని, అగ్నివీర్ పథకం దేశ రక్షణకు ప్రమాదకరమని, ఆర్థిక విధానాల్లోనూ మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విరుచుకపడ్డారు. 70 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 40 శాతానికి పెరిగిందని, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. కానీ అన్నదాతల ఇప్పుడు తీవ్రంగా నష్టపోతున్నారని దుయ్యబట్టారు. గతంలో ఏ ప్రధాని కూడా మోడీ అంతలా దిగజారి మాట్లాడలేదని, పదేళ్లలో ఏం చేశారో చెప్పటం లేదని, మళ్లీ గెలిస్తే ఏం చేస్తారో చెప్పటం లేదని ఉత్తమ్ ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం గత

## 13వ తేదీన వేతనంతో కూడిన సెలవు.. ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 10 : తెలంగాణలో ఈ నెల 13వ తేదీన 17 ఎంపీ స్థానాలకు ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెలవు విషయం కీలక నిర్ణయం తీసుకుంది. మే 13న వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ సెలవు నిబంధనలను కచ్చితంగా అన్ని కంపెనీలు, సంస్థలు అమలు చేయాలని వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని, లేదంటే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. అయితే ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే హవా కేసీఆర్

### -ఎన్డీఏ, ఇండియా కూటమిని ప్రజలు నమ్మరు
### -లిక్కర్ స్కామ్ మోదీ సృష్టి
### -కేజ్రీవాల్, కవితలిద్దరూ అమాయకులే
### -న్యాయ స్థానాలపై నమ్మకం ఉంది
### -ఇద్దరు కడిగిన ముత్యంలా బయటకు వస్తారు
### -బీజేపీకి పూర్తి స్థాయిలో ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు
### -జాతీయ మీడియాతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మే 10 :ఈ లోక్ సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే బలమైన పక్షంగా నిలబోతున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. అధిక స్థానాలు కైవసం చేసుకునేది ప్రాంతీయ పార్టీలేనని, అందులో ఎటువంటి సందేహం లేదన్నారు.. జాతీయ మీడియాకు ఇవాళ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... ఇండియా, ఎన్డీయే ఈ రెండు కూటములను ప్రజలు నమ్మడం లేదని, ఈ రెండు కూటములు ఈ ఎన్నికల్లో దెబ్బతింటాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు.. లిక్కర్ స్కామ్ పై మాట్లాడుతూ.. ఈ స్కామ్ సృష్టి కర్త మోదీనే అంటూ ఆరోపించారు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రధాని క్రూరమైన ఆట ఆడుతున్నారని, ఇందులో ఎటువంటి స్కామ్ లేదని అన్నారు.

ఈ కేసులో కవిత, అరవింద్ కేజ్రీవాల్ అమాయకులు అని, ఇది కేవలం పొలిటికల్ గేమ్ అని కొట్టి పారేశారు. రాష్ట్రం రూపొందించుకున్న లిక్కర్ పాలసీని స్కామ్ అని ఏ ఫూల్ అంటారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ దేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన లిక్కర్ పాలసీలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కేసులో నయా పైసా రికవరీ చేయలేదని ధ్వజమెత్తారు. ఈడీ, సీబీఐలు బీజేపీకి అనుబంధ సంస్థలుగా పని చేస్తున్నాయని ఆరోపించారు. తమకు కోర్టులపై నమ్మకం ఉందని కచ్చితంగా తమకు న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అటు కేజ్రీవాల్, ఇటు కవితలు కడిగిన ముత్యంలా బీజేపీతో బీఆర్ఎస్ సీక్రెట్ గా ఒప్పందం కుదుర్చుకున్నాయని, ప్రతి సందర్భంలో



బీజేపీకి బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంపై కేసీఆర్ స్పందిస్తూ, బీజేపీకి బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో ఎప్పుడూ అండగా లేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్ళలో కేంద్రంతో రాజ్యాంగపరమైన సత్సంబంధాలు కొనసాగించామన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ కోరితేనే తాము మద్దతు ఇచ్చామని అదే సమయంలో రైతు చట్టాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విజయం పాలపొంగులాంటిదని వ్యాఖ్యానించారు.. తమ కంటే ఎక్కువ నిధులు ఇస్తానంటే ఆశపడి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించారని అన్నారు. అయిదు నెలలోనే కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలు అర్థం చేసుకున్నారని, ఈ ఎన్నికలలో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమని, తాము తిరిగి పుంజుకుని అధికారంలో వస్తామని కెసిఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీ కవిత, మరో నలుగురు నిందితుల పాత్రపై ఈడి ఛార్జిషీట్ దాఖలు

### - కవిత బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను మే 24కు వాయిదా

న్యూ ఢిల్లీ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మార్చి 15న కవితను అరెస్టు చేసి... మరుసటి రోజు రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు ముందు ఈడీ హాజరుపరిచిన విషయం తెలిసిందే. అయితే ఈ రోజు(శుక్రవారం) ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ – ఈడీ ఏడో ఛార్జిషీట్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మరో నలుగురు నిందితుల పాత్రపై దర్యాప్తు సంస్థ ఛార్జీషీట్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.ఢిల్లీ మద్యం విధానం కేసులో సూత్రధారి, పాత్రధారి కవిత అని వాదనల సందర్భంగా ఈడీ కోర్టుకు చెప్పింది. దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో భాగంగా సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసతున్నట్లు కోర్టుకు ఈడీ తెలిపింది. కవిత, ఛన్‌ప్రీత్ సింగ్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అర్వింద్ సింగ్‌ల పాత్రపై సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. 10 రోజుల కస్టడీ అనంతరం... మార్చి 26 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో తీహాడ్ జైల్లో కవిత ఉంటున్నారు.కాగా... ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయ్యి ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు (శుక్రవారం) ఢిల్లీ హైకోర్టులో విచారణ ముగిసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను మే 24కు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయించింది. కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలకు ఈడీ సమయం కోరడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ కేసులో తనపై నమోదైన మనీ లాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో మార్చి 15న కవిత అరెస్టయ్యారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలులో ఆమె తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే.

## ఎన్నికల పోలింగ్ సందర్భంగా టిఎస్ఆర్‌టిసి సంస్థ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా టిఎస్ఆర్‌టిసి సంస్థ ప్రత్యేక బస్సులు నడుపనుంది. టిఎస్ఆర్‌టిసి సంస్థ దాదాపుగా రెండు వేల ప్రత్యేక బస్సులు నడుపనుంది.

ఎంజిబిఎస్ నుంచి 500, జెబిఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్‌బి నగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులను నడపనుంది. నేడు, రేపు ఎల్లుండి నడిచే 450 బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తి చేశారు. ప్రయాణీకుల రద్దీ మేరకు బస్సులు టిఎస్ఆర్‌టిసి సంస్థ నడపనుంది. హైదరాబాద్‌లో ప్రయాణికులతో బస్టాండులు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి.

## కట్టుకథలతో అల్లిన ఒక స్టోరీ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు : కేటీఆర్

హైదరాబాద్, మే 10 : కేవలం ఊహాజనిత కట్టుకథలతో అల్లిన ఒక స్టోరీ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఏఎన్ఐ ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ అనేది ఢిల్లీ ప్రభుత్వ అంతర్గత వ్యవహారం. ఈ దేశంలో అనేక పాలసీలు మార్చారు. అదానీ కోసం బొగ్గు పాలసీ, విమానయాన పాలసీ మార్చిన విషయం వాస్తవం కాదా.. వాళ్ళ మీద ఏం చర్యలు తీసుకున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా ఢిల్లీ పాలసీ కేసు విచారణ చేస్తున్నా ఒక రూపాయి అయినా ఎక్కడైనా రికవరీ చేశారా.. కేవలం ఊహాజనిత




కట్టుకథలతో అల్లిన ఒక స్టోరీ ఈ ఎక్సైజ్ పాలసీ కేసు. న్యాయ వ్యవస్థపై పూర్తిస్థాయి నమ్మకం ఉంది. మోడీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంది. బలమైన ప్రాంతీయ పార్టీ నాయకులు ఉండకూడదన్న లక్ష్యంతో ఈ రకంగా బీజేపీ వ్యవహరిస్తుంది. బీజేపీలో చేరిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రాజన్నకి మోడీ ఒక్క రూపాయి ఇవ్వలే.. : కేసీఆర్

రాజన్న సిరిసిల్ల, 10 :(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరుందిన రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఆలయ అభివృద్ధి కోసం ఒక రూపాయి కూడా ఇస్తామని ప్రకటించలేదని మాజీ ముఖ్యమంత్రి, గులాబీ దళపతి కేసీఆర్ ఆరోపించారు. శుక్రవారం రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ.. హిందూ ధర్మం అని ప్రగల్భాలు పలికే మోడీ రాజన్న ఆలయానికి ఏమీ ఇవ్వలేదని, ధర్మం కోసం పనిచేస్తామన్న బండి సంజయ్ ఏమీ అడగలేదన్నారు.

చేనేత కార్మికులకు రావాలసిన బకాయిలు చెల్లించాలని ప్రశ్నిస్తే తనపై 48 గంటల నిషేధం విధించారన్నారు. మోడీ మరోసారి ప్రధాని అయితే పెట్రోల్ డీజిల్ ధర 400 రూపాయల వుతుందన్నారు. రైతులను పేదలను అన్ని వర్గాలను మోసగించిన బిజెపి, కాంగ్రెస్ లకు మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్లో ఓటు ఎలా వేస్తారని ప్రశ్నించారు. బిజెపికి కేంద్రంలో అధికారం ఇస్తే విదేశాల నుండి నల్ల డబ్బును తీసుకువచ్చి ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని ప్రగల్బాలు పలికిన మోడీ పదేళ్లు గడిచిన హామీ నిలుపుకోలేదన్నారు.

కాంగ్రెస్కు అధికారం ఇస్తే 15 వేల రూపాయల రైతుబంధు ఇస్తామని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచిన రైతులకు ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి తప్పారన్నారు. మహిళలందరికీ 2500 రూపాయలు ఇస్తామని, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని, విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని, రైతు కూలీలకు 12000 ఇస్తామని, పింఛన్లను 4 వేలకు పెంచుతామని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు.

డిసెంబర్ 9న 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి 5 నెలలుగా అమలు చేయడం మరిచి ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఆగస్టు 15వ తేదీన 2 లక్షల రుణమాఫీ చేస్తామని మరో డ్రామాకు తెరలేపారన్నారు. ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లను రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ఏ రోజు రెప్పపాటు కరెంటు పోకుండా తాము ప్రభుత్వం నదిపామని, ఈ ప్రభుత్వానికి కరెంటు ఇవ్వడం చేతకావడం లేదన్నారు.సాగునీటికి దిక్కేలేదు కనీసం తాగునీరు కూడా అందించని అసమర్థ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ వార ప్రదాయిని గోదావరి జిల్లాలను తీసుకెళ్తామని మోడీ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రం వచ్చాక చేనేత అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలులోకి తెచ్చామన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ గిఫ్టులు, స్కూల్ యూనిఫామ్ లు కార్మికులచే చేయించి వారిని అభివృద్ధి దిశలో పయనించేలా చేసామన్నారు. ఇటీవల రంజాన్ పర్వదినం కోసం ప్రతి ఏడాది ఇచ్చే రంజాన్ తోఫాలు ఈ ప్రభుత్వం అందించలేదన్నారు. రైతులు కష్టించి పండించిన దాన్యం వర్షం నీటికి తడిసిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బండి సంజయ్ కి వినోద్ కు పోలిక ఉందా అని ప్రశ్నించారు. ఆయన మాట్లాడితే కనీసం ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. భారీ మెజార్టీతో వినోద్ కుమార్ ను గెలిపించాలన్నారు. సిరిసిల్ల రాజన్న జిల్లాను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్నారని, జిల్లా రద్దు కాకుండా ఉండాలంటే పార్లమెంటరీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ ను గెలిపిస్తే తాను జిల్లా రద్దు కాకుండా కొట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, చల్మడ లక్ష్మీనరసింహారావు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, గూడూరి ప్రవీణ్, రవీందర్రావు, అరుణ తో పాటు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

అవిరళముగ కృషి సలుపుచు
ప్రవచించిన శాస్త్రచయము ఫలితము లిడగన్
ప్రవిమలముగ-ఇటుకలతో
భవనము వచ్చినది శాను ఫ్రాన్సిస్ కోలో



(11-5-1850 ఆధునిక కాలంలో ఇటుకలతో మొట్టమొదటి భవనం శాన్ ఫ్రాన్సిస్ కోలో కట్టబడింది)

-రాధశ్రీ

సెల్:9494481210

# వలస పక్షుల ఆవాసాలను పరిరక్షించలేమా !

(11 మే "ప్రపంచ వలస పక్షుల దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా వేల రకాల పక్షి జాతులు ప్రతి ఏట మే, అక్టోబర్ మాసాల్లో సుదూర ప్రాంతాలకు వలస వెళ్లడం, చూపరులకు కనువిందు కల్పించడం అనాదిగా చూస్తున్నాం. పక్షుల వలసలకు చిత్తడి నేలలు, నీటి వనరులు ప్రధాన ఆవాస కారణంగా నిలుస్తుండటం గమనిస్తున్నాం. వలస పక్షుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలను చర్చించేందుకు 2006 నుంచి ప్రతి ఏట మే మాసంలోని రెండవ శనివారం, అనగా 11 మే 2023 రోజున "ప్రపంచ వలస పక్షుల దినం (వరల్డ్ మైగ్రేటరీ బర్డ్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఐరాస రూపొందించిన ప్రపంచ వలస పక్షుల దినం-2024 నినాదంగా "వలస పక్షుల పరిరక్షణకు క్రిమికీటకాల ప్రాముఖ్యత (ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్సెక్ట్స్ ఫర్ మైగ్రేటరీ బర్డ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం, వాటి ప్రాధాన్యాలను వివరించడం జరుగుతోంది. నీటి వనరులు ఇంకిపోవడం, అతి శీతల వాతావరణం, ఆహార కొరత లాంటి పలు కారణాలతో వలస పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి అనువైన ఎంపిక చేసుకున్న ప్రదేశాలకు చేరతాయి.

జలమే జీవకోటి జీవనం:

భూగ్రహంపై సహజ వనరుగా అందుబాటులో ఉన్న జలమే జీవకోటికి ప్రాణాధారంగా నిలుస్తున్నది. చిత్తడి నేలలు, నదులు, కొలనులు, వాగులు వంకలు, చెరువులు, సరస్సులు, కుంటలు, కాలువలు, సముద్ర తీరాలు లాంటివి వలస పక్షులకు జీవనాధారంగా నిలుస్తున్నాయి. నీటి వనరులపై ఆధారపడి బతుకుతున్న పక్షులు జల వనరుల కొరతతో అనాదిగా వందల వేల కిలోమీటర్లు అవిశ్రాంతంగా ప్రయాణిస్తూ నిర్దేశిత స్థానాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం. మానవ వినియోగం అతిగా పెరగడం, చెరువులను/కుంటలను అక్రమంగా ఆక్రమించడంతో నీటి కటకట ఏర్పడుతూ తాగు సాగు నీటి వనరులు ఎండిపోతున్నాయి. వలస పక్షులను పరిరక్షించడానికి, జల వనరులను కాపాడడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని, లేని ఎడల వలస పక్షి జాతులు అంతరించే దుస్థితి రావచ్చని హెచ్చరిస్తున్నారు.

భారత్‌లో వలస పక్షులు:

ప్రపంచ పక్షి జాతిలో దాదాపు 40 శాతం పక్షి జాతులు (దాదాపు 4000 రకాలు) ఆహారం, ఆవాసం, నీటి వనరుల్ని వెతుక్కుంటూ వలసలు వెళుతున్నట్లు అంచనా వేశారు. కొన్ని రకాల పక్షి జాతులు ఏడాదికి రెండు సీజన్లలో వలసలు వెళ్ళడం గమనిస్తున్నాం. కొన్ని రకాల వలస పక్షులు దాదాపు 15,000 మైళ్ల వరకు వలసలు వెళ్ళడం, సముద్ర మట్టానికి 5.5 మైళ్ల ఎత్తులో ప్రయాణించడం గమనించారు. భారత దేశానికి వచ్చే ముఖ్య వలస పక్షుల్లో సైబీరియన్ క్రేన్, గ్రేటర్ ఫ్లెమింగో, డెమొయిసెల్లె క్రేన్, అమూర్ ఫాల్కన్, బ్లూత్రోట్, బార్-హెడెడ్ గూస్, రోజీ స్టార్లింగ్, రుడ్డీ షెల్డక్, కింగ్‌ఫిషర్, గ్రేట్ వైట్ పెలికన్, నార్థన్ పిన్‌టెయిల్, యురాసియన్ టీల్, పైడ్ అవోసెట్ అనే జాతులు ఉన్నాయి. ఇండియాలో దాదాపు 400 రకాల వలస పక్షులు ఉన్నాయి. ఇటీవల గుజరాత్‌లోని భుజ్ ప్రాంతానికి ప్రతి ఏడాది లాగే సెంట్రల్ ఏసియా/ యూరోప్‌ల నుంచి ప్రయాణిస్తూ యూరోపియన్ రోలర్, ఎర్రటి తోక కలిగిన ష్రైక్, ఫ్లైక్యాచర్, శ్రబ్ రాబిన్, కామన్ కుకూ బీ ఈటర్ లాంటి 8 రకాలైన వలస పక్షుల రాక కోసం పక్షి ప్రేమికులు ఎదురు చూడడం, తమ కెమరాల్లో బంధించడం జరిగింది. తమిళనాడులోని పలు ప్రాంతాలకు యెల్లో వ్యాగ్‌టేయిల్, సిట్రిన్ వ్యాగ్‌టేయిల్, వైట్ వ్యాగ్‌టేయిల్ లాంటి నీటి పక్షులు వలస రావడం అనాదిగా జరుగుతున్నది. ముంబాయి, భరత్‌పూర్, ఢిల్లీ, చెన్నై లాంటి పలు మహానగరాల్లోని పార్కులకు వలస పక్షులు రావడం కూడా నమోదైంది.

తెలుగు రాష్ట్రాల్లో వలస పక్షులు:

ప్రతి ఏట 140 – 150 రకాలైన వలస పక్షులు దాదాపు 4 లక్షలు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చేరతాయి. గాడ్‌విట్, సాండ్‌పైపర్, పిన్‌టేయిల్, స్టింట్స్, పోచర్డ్, విజ్లింగ్ డక్, పెలికన్, స్టార్క్, సైబీరియన్ పక్షులు లాంటి వలస పక్షి జాతులు కొల్లేరు, కొరింగా వణ్యప్రాణి సాంచురీ, పులికాట్ బర్డ్ సాంచురీ లాంటి ప్రాంతాలకు చేరడం గమనిస్తున్నాం. నీటి మీద సంచరించే వలస పక్షుల ఆహారంగా చేపలు, పురుగులు, ఫైటోప్లాంక్టన్స్‌లను సేకరిస్తాయి. తెలంగాణ రాష్ట్రంలోకి నిజామాబాదు జిల్లా రుద్రూర్ ట్యాంక్‌కు గ్రేలెగ్డ్ గీస్ అనబడే వలస పక్షి జాతి యూరోప్ నుంచి చేరుతుంది. పూర్వ మెదక్, ఆదిలాబాదు, వరంగల్ (పాకాల, కేశవాపూర్, మేచరాజుపల్లి, ముచ్చర్ల నాగారం, ఘనపురం, శాయంపేట), ఖమ్మం(చింతపల్లి చెరువు), జిల్లాల్లోని జల నిలయాలకు 40-50 రకాలైన వలస పక్షులు డిసెంబర్/ జనవరి మాసాల్లో చేరతాయి. హైదరాబాదు చుట్టుపక్కల ప్రాంతాల్లోని అమీన్‌పూర్, హిమాయత్‌సాగర్, గండిపేట చెరువులు 150 రకాల వలస పక్షుల (బాతులు, హారియర్స్, ఈగల్స్, ఫాల్కన్, ఫ్లెమింగ్, ఫ్లైక్యాచర్, షోవలర్, వాడర్స్ లాంటివి) విడిదిగా పని చేస్తున్నాయి.

విదేశాల నుంచి వేల కిమీ ప్రయాణించి ఆవాసం, ఆహారం, జల వనరుల ఒడ్డుకు చేరి ప్రకృతి అందాలను ఇనుమడింపజేస్తున్న వలస పక్షుల రాకకోసం అందరం ఎదురు చూడాల్సిందే. చెరువుల దురాక్రమణలు, కుంటను మింగే రియాల్టర్లు, అపరిమిత అనాలోచిత పట్టణీకరణ, జలాశయాలను మింగే ప్రబుద్ధుల కట్టడి చర్యలను తీసుకుంటూ వలస పక్షుల రాకను ఆహ్వానిస్తూ, విదేశీ అతిథి పక్షులకు సాదర స్వాగతాన్ని, అపూర్వ ఆతిథ్యాన్ని ఇద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# సాయుధ దళాల సంయుక్తత్వం మరియు ఏకీకరణ అనే అంశాలపై జరుగనున్న రెండు రోజుల సమావేశం 'పరివర్తన్ చింతన్ - 2'

న్యూఢిల్లీ, మే 10:భారతదేశంలోని త్రివిధ సాయుధ దళాలు (సైన్యం, వాయు సేన మరియు నౌకాదళం లు) త్వరలోనే కలిసికట్టుగా కార్యకలాపాల ను జరపాలనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వాటి మధ్య జరుగుతూ ఉన్న సంయుక్తత్వం మరియు ఏకీకరణ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకు పోయే కృషి చోటు చేసుకొంటోంది.

"పరివర్తన్ చింతన్" ను 2024 ఏప్రిల్ నెల 8 వ తేదీ న నిర్వహించడమైంది. ఇది దేశం లోని త్రివిధ దళాల కు చెందిన సంస్థ ల యొక్క ప్రముఖుల కోసం జరిపినటువంటి ముఖ్య సమావేశం అని చెప్పాలి. నూతన సంస్కరణల ప్రధానమైన ఆలోచన లు మరియు కార్యకలాపాల ను విస్తరించడం ఈ సమావేశం యొక్క ఉద్దేశ్యం గా ఉండింది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ శ్రీ అనిల్ చౌహాన్ అధ్యక్షత న 2024 మే నెల 9 వ మరియు 10 వ తేదీ లో రెండు రోజుల పాటు న్యూ ఢిల్లీ లో 'పరివర్తన్ చింతన్ - 2' ను నిర్వహించాలనే పథకాన్ని రూపొందించడమైంది.

చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ తాలూకు ఉప సంఘాలన్నింటి సభ్యులు, ఆ కమిటీ యొక్క శాశ్వత ఛైర్‌మన్ గా ఉన్నటువంటి సిడిఎస్ మరియు త్రివిధ దళాల ప్రధాన అధికారులు అనేక రంగాల లో చోటు చేసుకొన్న పురోగతి ని సమీక్షించనున్నారు. దీనికి అదనంగా, సాయుధ దళాల సంయుక్తత్వం మరియు ఏకీకరణ ల మాధ్యం ద్వారా పరివర్తన దిశ లో అపేక్షిత అంతిమ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన సంస్కరణల పైన చర్చించడం జరుగుతుంది.

# విద్యుద్ఘాతంతో ఒకరు మృతి..

నిజామాబాద్, మే 10 :నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం వర్జిన్ తాండ గ్రామంలో శుక్రవారం విద్యుద్ఘాతంతో అదే గ్రామానికి చెందిన బాధవత్ రవి (42) అనే వ్యక్తి మృతి చెందినట్లు సిరికొండ ఎస్సై జి.రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రవితన పొలం వద్ద పంప్ మోటర్ కు విద్యుత్ సరఫరా కోసం వైర్లు బిగించడానికి ట్రాన్స ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసి స్థంభంపైన వైర్లు బిగిస్తున్నారు.

మృతుడు రవి విద్యుత్ సరఫరా నిలిపివేసిన విషయం తెలియని అదే తాండకు చెందిన బనవత్ గణపతి విద్యుత్ సరఫరా కోసం ఏబీ స్విచ్ స్టార్ట్ చేయడంతో విద్యుత్ సరఫరా జరగడం వల్ల విద్యుత్ ప్రమాదంలో రవి మృత్యువాత పడ్డట్లు ఎస్సై వివరించారు. మృతుని భార్య బాధవత్ లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పంచనామా నిమిత్తం నిజామాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ఎనెక్సీలో భావి అంతర్జాతీయ యోగ దివస్ సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్‌డిఒఎన్ఇఆర్

న్యూఢిల్లీ, మే 10:రాబోయే అంతర్జాతీయ యోగ దివస్ కు సన్నాహకమా అన్నట్లు గా ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎమ్‌డిఒఎన్ఇఆర్) న్యూ ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ ను ఆనుకొని ఉన్న భవనం లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం లో భారతీయ వారసత్వం లో చెక్కుచెదరకుండా ఇమిడిపోయి ఉన్న యోగాభ్యసం తాలూకు చిరకాలిక ప్రయోజనాల ను గురించి ఎమ్‌డిఎన్ఐవై కు చెందిన బోధకులు మరియు అభ్యాసకులు చాటి చెబుతూ ఉండగా వారి మార్గదర్శకత్వం లో ఎమ్‌డిఒఎన్ఇ ఆర్ యొక్క కార్యదర్శి మరియు అధికారుల తో పాటు విజ్ఞాన్ భవన్ ఎనెక్సీ లోని సిఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మానవుని సమగ్ర స్వస్థత ను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యం తో ఈ కార్యక్రమం లో యోగ ఆసనాల ను తెలియజేయడమైంది. శారీరికమైన, మానసికమైన మరియు ఆధ్యాత్మికమైన ఆరోగ్యం పరం గా యోగ యొక్క భూమిక ను గురించి డిఒఎన్ఇఆర్ కార్యదర్శి వివరించారు. ఎమ్‌డిఒఎన్ఇఆర్ ఆధ్వర్యం లో చేపట్టిన ఈ సన్నాహక కార్యక్రమం యోగ మాధ్యం ద్వారా మానవుల ఆరోగ్యాన్ని మరియు ఆరోగ్య సంస్కృతి ని పెంపొందింప చేయడం కోసం భారతదేశం కంకణం కట్టుకోవడాన్ని పునరుద్ఘాటిస్తున్నది. విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమం యోగ కు ఉన్న సార్వజనికమైనటువంటి మక్కువ ను స్ఫురణ కు తేవడం తో పాటుగా వర్తమాన సవాళ్ళ ను ఎదుర్కోవడం లో యోగ కు ఉన్న చిరకాల ప్రాసంగికత ను గుర్తు కు తెస్తున్నది. భారతదేశ ప్రాచీన సంప్రదాయం లో వేళ్ళూనుకొన్నటువంటి యోగ మనుష్యుల శారీరిక, మానసిక మరియు ఆధ్యాత్మిక స్వస్థత పై తన సకారాత్మకమైన ప్రభావాన్ని ప్రసరింప చేస్తుందన్న విస్తృత గుర్తింపు ను తెచ్చుకొంది. ఎమ్ డిఒఎన్ఇఆర్ ఆధ్వర్యం లో తాజా కార్యక్రమం స్వస్థత మరియు సమతుల్యభరిత జీవన సరళి కోసం రోజువారీ జీవనం లో యోగ ను ఒక భాగం గా చేసుకోవడానికి కట్టబెట్టవలసినటువంటి మహత్వాన్ని ప్రకటిస్తున్నది.

# జగన్ 2.0 ప్రచారం జోష్ .. - వాడ వాడల్లో స్టార్ క్యాంపెయినర్లు



అమరావతి, మే 10 :జగన్ కోసం సిద్ధంఏడు రోజుల్లోనే,79 లక్షల మంది సామాన్యులు వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపెయినర్లుగా సీఎం జగన్ కి మద్దతు తెలిపారు. వీరంతా కేవలం జగన్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాదు, నవరత్నాలు ప్లస్ మానిఫెస్టోలోని హామీలను ప్రతి ఇంటింటా ప్రచారం చేస్తున్నారు, అంతే కాకుండా జగన్ విశ్వసనీయత కలిగిన నాయకుడని చాటి చెబుతున్నారు . అన్నిటికంటే పెద్ద మొత్తంలో మహిళలే స్టార్ క్యాంపెయినర్లుగా పాల్గొంటున్నారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. కాకినాడలో, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో అత్యధికంగా స్టార్ క్యాంపెయినర్లు తమ విశ్వాసాన్ని జగన్ కోసం తెలుపుతూ జగన్ కోసం సిద్ధం ప్రచారంలో ముందు నిలిచారు. ఇందులో ముఖ్యంగా మహిళా లబ్దిదారుల నుండి విశేష స్పందన లభించడం గమనార్హం.

ఈ స్టార్ క్యాంపెయినర్లు ఇంటింటికి తిరుగుతూ జగనన్న సంక్షేమ పథకాలతో తమకు అందుతున్న ప్రయోజనాలు, సుపరిపాలన తెలుపుతూ, 2014లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని చంద్రబాబుకు ఒకవైపు ఉంటె సీఎం జగన్ లాంటి నాయకుడి మరో వైపు ఉండి తమ సమస్యలను తీరుస్తున్నారని చెబుతున్నారు. ఈ రోజు కూడా, తమ 2024 మేనిఫెస్టోకి నమ్మకం కలిగించే ఒక్క ఆధారం కానీ దాని వెనకాల ఉన్న తర్కం పైన వారికీ అవగాహన లేదు. మేనిఫెస్టో వాగ్దానాలు, ముస్లిం రిజర్వేషన్లు, రాజధాని, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి అంశాల్లో కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలో చిత్త శుద్ధి లేదని స్టార్ క్యాంపెయినర్లు ప్రచారం చేయటం మరో విశేషం.

# మీరు మాట్లాడితే సెక్యులర్ మేం మాట్లాడితే మతతత్వమా .. కెసిఆర్ కు బండి ప్రశ్న

కరీంనగర్, మే 10 : మతం గురించి మీరు మాట్లాడితే సెక్యులర్ మేం మాట్లాడితే మతతత్వమా అని కెసిఆర్ ను బిజెపి ఎంపి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్‌కు వచ్చి 80 శాతం ఉన్న హిందువుల గురించి మాట్లాడకుండా, 20 శాతం ఉన్న ముస్లింలను ఒక్కటి కావాలని పిలుపునివ్వడం ఏమిటంటూ గులాబీ బాస్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడిన బిఆర్ ఎస్ పార్టీ కి ఈ ఎన్నికలలో కరీంనగర్ ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపు ఇచ్చారు..నీ గడీలు బద్దలు కొట్టిం..నీ మెడలు వంచి..నీ ప్రభుత్వాన్ని గద్దె దించి.. నిన్ను ఫామ్ హౌస్ నుంచి గుంజుకొచ్చి ధర్నా చౌక్ వద్ద నిలబెట్టింది నేనే అంటూ కెసిఆర్ కు గుర్తు చేశారు బండి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆయన పెట్టిన పోలీస్ వలయాన్ని ఛేధించుకొని హైదరాబాద్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు వెళ్లి జైశ్రీరామ్ అని గర్జించిన వ్యక్తిని తానే అన్నారు.



శ్రీలేఖ సాహితి, వరంగల్

ఆహ్వానము

చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం

12-05-2024 సాయంత్రం 5.00 గంటలకు
గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి గృహములో
జూబ్లీ హిల్స్, హైదరాబాద్

ముఖ్య అతిథి
"పద్మవిభూషణ్" గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రభుత్వం

సభాధ్యక్షులు
డా॥ రేవూరి అనంత పద్మనాభరావు

సత్కారములు
శ్రీమతి శ్రీదేవి మురళీధర్
హైదరాబాద్
డా॥ వైష్ణవ వేంకటరమణమూర్తి
నంద్యాల
శ్రీ గార రంగనాథం
రాజాం, విజయనగరం జిల్లా

పుస్తకావిష్కరణలు
శ్రీభాష్యము – కరదీపిక
వేదాంత దేశికులు – హంస సందేశము

# ఆ యాక్ట్ కు మద్దతు ఇచ్చింది మీరే కదా? - చంద్రబాబును నిలదీసిన సజ్జల

అమరావతి, మే 10 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విషయంలో ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారని, . రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్టు క్రియేట్ చేసి విషప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. 2019లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కు టీడీపీ ఎందుకు మద్దతిచ్చిందని ఆయన ప్రశ్నించారు. దీనిపై అసత్యాలు ప్రచారం చేసి దాని ద్వారా లబ్ధి పొందాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు అండ్ ముఠా అత్యంత దిగజారుడు రాజకీయం చేస్తోందన్నారు. వీళ్లు అసలు మనుషులా.. పిశాచాలా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఓ చెత్త అని బీజేపీతో చెప్పించగలరా అని సవాల్ విసిరారు. బాలకృష్ణ, పవన్ కల్యాణ్ భూములు కొన్నారని, మరి ఆ పత్రాలు జిరాక్స్ కాపీలేనా? అంటూ ప్రశ్నించారు.

తమరి హయాంలోనే ప్రారంభమైన ఈ-స్టాంపింగ్ విధానాన్ని బాబు జిరాక్స్ కాపీలంటున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తామని చంద్రబాబు.. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాతో ఎందుకు చెప్పించలేదని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ తర్వాత భూమికి ప్రభుత్వం పూచీ ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఇసుక తవ్వకాలను ఆపండి.. ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**–అనుమతి ఉన్నా యంత్రాలతో తవ్వకాలు నిషేధం**
**–గతంలో ఇచ్చిన నిలిపివేత ఆదేశాలు**
**–పాటించకపోవడంపై సీరియస్**
**–కాగితాలపైనే నియంత్రణ..యదేచ్ఛగా తవ్వకాలంటూ ఆగ్రహం**
**–ఇసుక క్వారీల పర్యవేక్షణను కేంద్రానికి అప్పగింత**

అమరావతి, మే 10 :ఆంధ్రప్రదేశ్ లో అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే ఆపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నేడు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మైనింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లి తనిఖీలు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

రాష్ట్రంలో అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని, అనుమతి ఉన్న చోట కూడా యంత్రాలు ఉపయోగించవద్దని ఏప్రిల్ 29న సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ తర్వాత కూడా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపట్టారని, దీనికి సంబంధించి ఇసుక రవాణా చేస్తున్న వాహనాలతో పాటు ఫొటోలు, తేదీ, సమయంతో కూడిన ఆధారాలను స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు నాగేంద్ర కుమార్ సుప్రీంకోర్టు ముందు ఉంచారు. దీంతో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణం నిలిపివేయడంతో పాటు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ తవ్వకాలు నిలిపివేశారా లేదా అన్నది తనిఖీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. విచారణ సందర్భంగా అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలన్నీ కేవలం కాగితాలపైనే ఉన్నాయని క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించవని న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వంపై కుట్ర .. రాజకీయాల్లోనే మహా దారుణం - జగన్

అమరావతి, మే 10 : "ఎవరైనా దొంగతనం చేస్తే దొంగోడు అని కేసు పెడతాం. మోసం చేస్తే చీటింగ్ కేసు పెడతాం. మరి మేనిఫెస్టో పేరుతో మోసగించే చంద్రబాబు లాంటి వాళ్ల మీద ఎలాంటి కేసులు పెడదాం"అని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం ఎన్నికల ప్రచార సభలో ఘర్జించారు. అమరావతి ప్రాంతం మంగళగిరిలో ఈ సభకు జనం పోటెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీయే కూటమిపై నిప్పులు చెరిగారు. మరీ ముఖ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబును తూర్పారబట్టారు. "వీళ్ల కుట్రలు ఏ స్థాయిలో ఉన్నాయంటే .. జగన్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో.. అక్కడి వర్గాలు ఎక్కడ జగన్ ను తమ వాడిగా భావిస్తున్నారో.. అని అసూయతో కుట్రలకు తెర తీశారని ఆరోపించారు.

" వీళ్లందరూ అవ్వాతాలకు పెన్షన్ రాకుండా చేసిన దౌర్భాగ్యులు. వీళ్ల కుట్రలు ఇంకా ఏ స్థాయిలో ఉన్నాయంటే.. రెండు నెల కిందట బటన్ నొక్కితే ఎన్నికల కోడ్ పేరుతో అక్కచెల్లమ్మలకు డబ్బు వెళ్లకుండా అడ్డుకున్నారు. వీటి మీద స్వయంగా ముఖ్యమంత్రి కోర్టుకు వెళ్లారంటే.. ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థం చేసుకోవాలి"అని వివరించారు. " అంతే కాదు, మీ బిడ్డ జగన్ ఏదీ ఎన్నికల కోసం చేయలేదు. మీ బిడ్డ పాలనలో అలాంటి దాఖలాలూ లేవు. మొదటి రోజు నుంచి ప్రతీ నెలా క్యాలెండర్ ఇస్తూ ఈ నెలల రైతు భరోసా, ఈ నెలలో ఈ పథకం ఇస్తాం అంటూ సంవత్సరం క్రమం తప్పకుండా అందరికీ మంచి చేస్తూ వస్తుంటే ఎన్నికలకు ముందే కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారు."అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ప్రభుత్వం గొంతు పిసికే కుట్ర ఇది

" మన ప్రజాస్వామ్యంలో ఐదేళ్ల కోసం ప్రభుత్వం ఎన్నుకుంటున్నారు. 57 నెలలకే ఈ ప్రభుత్వం గొంతు పిసికేయాలని చూస్తున్నారు. ఇది కేవలం ప్రభుత్వం గొంతు పికసడం మాత్రమే కాదు. అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలు, రైతులు, పేద విద్యార్థుల గొంతుల్ని నొక్కడమే అని గమనించండి"అని మంగళగిరి ప్రజలను జగన్ కోరారు. మళ్లీ ఇలంటీర్లు ఇంటికే రావాలన్నా.. పేదవాడి భవిష్యత్ బాగుపడాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా.. మన పిల్లలు, వారి బడులు, వారి చదువులు ఇవన్నీ బాగుపడాలన్నా.. మన వ్యవసాయ మూ, హాస్పిటల్ మెరుగుపడాలన్నా.. ఇవన్నీ జరగాలంటే ఏం చేయాలి.. ఏం చేయాలి.. బటన్లు ఫ్యాన్ మీద నొక్కాలి. అని జగన్ అభ్యర్థించారు.

## మీ బిడ్డ దగ్గర డబ్బు లేదు

" మంగళగిరి సీటు బీసీల సీటు. వెనుక బడిన వర్గాల సీటు. నేను గతంలో ఆర్కేకు ఇచ్చా. ఇప్పుడు ఆర్కేను త్యాగం చేయమని చెప్పి.. బీసీకి ఇప్పించా. కానీ, అవతల నుంచి పెద్ద పెద్ద నేతలు వచ్చి.. డబ్బు వెదజల్లుతున్నారు.

మీ బిడ్డ దగ్గర పెద్దగా డబ్బు లేదు. బటన్లు నొక్కి పంచిపెట్టడమే ఉంది. చంద్రబాబు పాలనలో అంతా దోచుకోవడం.. పంచుకోవడమే. కాబట్టి చంద్రబాబు మాదిరి మీ బిడ్డ దగ్గర డబ్బు లేదు. అందుకే ఆయన గనుక డబ్బు ఇస్తే వద్దు అనకండి తీసుకోండి. ఎందుకంటే ఆ డబ్బు మన దగ్గరి నుంచి దోచుకుందే. కానీ, ఎవరి వల్ల మంచి జరిగింది.. ఎవరు ఉంటే మంచి కొనసాగుతుంది అనేది ఆలోచన చేయండి" అని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి అభ్యర్థిని మురుగుడు లావణ్య, ఎంపీ అభ్యర్థి రోశయ్య, సిట్టింగ్ ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

# వైద్యం వికటించి బాలింత మృతి.. బంధువుల ఆందోళన..

నిజామాబాద్, మే 10 :ఆర్మూర్ పట్టణంలోని శ్రీ తిరుమల హాస్పిటల్లో పిట్ల సుమలత(25) అనే బాలింత వైద్యురాలు శ్రీదేవి వడ్లమూడి వైద్యుల నిర్వాకం వల్ల ప్రాణాలను కోల్పోయింది. మృతురాలి భర్త సాయిలు కథనం ప్రకారం? ఐదు నెలల క్రితమే ఉపాధి కోసం గల్ఫ్ కంట్రీకి వెళ్లడం జరిగింది. మృతురాలికి రెండు కాన్పు లు నార్మల్ డెలివరీలో జరగగా.. మూడవ కాన్పు కోసం శ్రీ తిరుమల హాస్పిటల్ లో చేరారు. వైద్యురాలు సుమలత ఆరోగ్యం బాగాలేదని నార్మల్ డెలివరీ కాకుండా సర్జరీ చేసి డెలివరీ చేయాలని చెప్పడంతో బంధువులు సరేనన్నారు.సర్జరీ అనంతరం మగ బిడ్డకు జన్మనిచ్చింది. మగ బిడ్డ పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బాధితురాలు కడుపులో మంటగా ఉందనడంతో వైద్యురాలు అనస్తీసియా డాక్టర్ ను కాదని తానే మత్తుమందు ఇవ్వడంతో హార్ట్ బీట్ పెరిగి గుండెపోటుతో చనిపోయిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. మహిళ చనిపోయి 24 గంటలు అయినా ఆసుపత్రి వర్గాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితురాలికి న్యాయం చేయాలని, డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు బంధువులు రోడ్డుపై బైఠాయించి హాస్పిటల్ ముందు రాస్తారోకో చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించారు.

# కరీంనగర్‌లో బీజేపీకి బిగ్ షాక్.. ఎమ్మెల్యే గంగుల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



కరీంనగర్, మే 10 : మరో రెండు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో కరీంనగర్‌లో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ వైఖరిని నచ్చని పలువురు నాయకులు ఆ పార్టీని వీడి గులాబీ గూటికి చేరారు. కరీంనగర్ 46వ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్ నేత బోయినపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గంగుల గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ నేత అక్కనపల్లి రాజుతో పాటుగా పెద్ద ఎత్తున యువకులు బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉన్నదన్నారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు తిరుపతినాయక్, మైకెల్ శ్రీను, పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సందర్భంగా ఈ నెల 13న వేతనంతో కూడిన సెలవు

## -జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి, మే 10:(నేటినిజం ప్రతినిధి):ఈ నెల 13న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ / జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 13న సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు పరిశ్రమలకు ఎన్నికల సమయంలో( ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెలవు) వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారు.




# రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ల డ్రామాలాడుతున్నారు : వినోద్ కుమార్



హైదరాబాద్, మే 10 : రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తీసేస్తారని అంటున్నారు. మరో వైపు బీజేపీ వాళ్లు కాంగ్రెస్ వస్తే రిజర్వేషను రద్దు చేసి ముస్లింలకు ఇస్తారని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. రిజర్వేషన్లు తీసే హక్కు ఎవరికి లేదని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దళిత సంఘాలు వినోద్ కుమార్ క్యాంపు కార్యాలయంలో కలిసి పూర్తి మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా నిర్మాణం చేసిన సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు,125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు.

రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులని, వాటిని రద్దు చేసే హక్కు ఎవరికి లేదని పేర్కొన్నారు. వీటిని ముట్టరాదని 2006లో సుప్రీంకోర్టు జడ్జి తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయాల కోసమే ఈ ప్రస్తావన తెస్తున్నాయని మండిపడ్డారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఎంపీగా గెలిపించాలని..ప్రతి సమస్యపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు కనవుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేష్, వంతడుపుల సంపత్, సాంబారి కొమురయ్య, క్యాదాసు ప్రభాకర్, బీమారపు సతీష్, పారునంది జలపతి పాల్గొన్నారు.




# పోలింగ్ ఏజెంట్ల నియామకం విషయంలో ఈసీ కీలక నిర్ణయం

### – ఏజెంట్లకు పోలీసు, రిటర్నింగ్ అధికారి వెరిఫేకషన్, ఆమోదం అవసరం లేదు

### –పోలీసు కేసులు ఉన్నా ఏజెంట్‌లుగా పనిచేయవచ్చు

అమరావతి, మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఏపీలో మరో మూడు రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. అలాగే పోలింగ్ ఏజెంట్ల నియామకం విషయంలో ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. సహజంగా పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ఏజెంట్లు గుర్తించిన తర్వాతే వారికి ఓటు వేసే హక్కు కల్పిస్తారు పోలింగ్ సిబ్బంది. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో అభ్యర్థుల తరపున ఏజెంట్లను నియమించుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియపై ఎలక్షన్ కమిషన్ కీలక ఆదేశాలు జారీచేసింది. పోలింగ్ ఏజెంట్ల నియామకం లిస్టును రిటర్నింగ్ అధికారికి ఇవ్వాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పోలింగ్ తేదీ రోజు ప్రిసైడింగ్ అధికారికి పోలింగ్ ఏజెంట్ తమ వివరాలు సమర్పించి నేరుగా విధులకు హాజరు కావచ్చని ఆదేశాలు జారీ చేసింది. గతంలో చేసినట్లు ఏజెంట్లకు పోలీసు, రిటర్నింగ్ అధికారి వెరిఫేకషన్, ఆమోదం అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. పోలింగ్ ఏజెంట్ల విషయంలో అధికార దుర్వినియోగం జరగకుండా ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. పోలీసు కేసులు ఉన్నా ఏజెంట్‌లుగా పనిచేయవచ్చని పేర్కొంది. ఏజెంట్ల నియామకం విషయంలో పోలీసులు అభ్యంతరాలు తెలిపే అధికారం లేదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# నేను పిఠాపురం వెళ్లడం లేదు.. చిరంజీవి షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్, మే 10 : టాలీవుడ్ యాక్టర్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రచార కార్యక్రమంలో బిజీగా ఉన్నారని తెలిసిందే. ఇప్పటికే పవన్ కల్యాణ్ తరపున పలువురు సినీ ప్రముఖులు ప్రచారంలో పాల్గొంటూ.. గాజు గ్లాస్ గుర్తుకు ఓటేసి పవన్ కల్యాణ్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి తన సోదరుడు పవన్ కల్యాణ్‌కు మద్దతునిస్తూ ఓ వీడియోను కూడా అందరితో పంచుకున్నాడు.

అయితే తాను రేపు (శనివారం) పవన్ కల్యాణ్ తరపున ప్రచారంలో పాల్గొనేందుకు పిఠాపురం వెళ్తున్నట్టు వస్తున్న వార్తలపై చిరంజీవి స్పందించాడు. ఈ విషయమై మీడియాతో మాట్లాడుతూ.. తాను పిఠాపురం వెళ్లడం లేదని స్పష్టం చేశాడు. ప్రచారానికి రావాలని కూడా తన తమ్ముడు ఎప్పుడు కోరలేదన్నాడు. తాను ప్రస్తుతం రాజకీయాలకతీతంగా ఉన్నానన్నాడు. తన తమ్ముడికి అండగా ఉన్నానని చెప్పేందుకే ఇటీవలే ఓ వీడియో విడుదల చేసినట్టు చెప్పాడు. దివంగత నటుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు భారతరత్నక అర్హుడని అన్నాడు మెగాస్టార్ చిరంజీవి.గత ఏపీ ఎన్నికల్లో రెండో చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్ కల్యాణ్.. ఈ సారి పిఠాపరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి బరిలోకి దిగుతున్నారని తెలిసిందే. పిఠాపు రంలో ఎలాగైనా పవన్ కల్యాణ్‌ను గెలిపించాలని మెగా ఫ్యామిలీ యాక్టర్లు ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కోరుతున్నారు. ఇప్పటికే పవన్ కల్యాణ్‌కు న్యాచురల్ స్టార్ నాని మద్దతు తెలియజేస్తూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు ట్వీట్ కూడా చేశాడు.

# మే 21 నుంచి ఉత్తరాఖండ్ రిషికేష్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, మే 10 : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రిషికేష్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఆంధ్ర ఆశ్రమంలో ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మే 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మే 20సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం నిర్వహిస్తామని చెప్పారు.

బ్రహ్మోత్స వాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు స్వామివారి వాహన సేవలు నిర్వహి స్తామని వెల్లడించారు.

### తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 10 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు.

నిన్న స్వామివారిని 65,508 మంది భక్తులు దర్శించుకోగా 25,996 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 2.97 కోట్లు వచ్చిందని పేర్కొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే : ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

సారంగాపూర్, మే 10 : అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని సర్కారు వెంటనే కొనుగోలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ డిమాండ్(ఓఒం ాజీనితీజీఎ నెబీఎజీతీ) చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ పాలనలో రైతాంగానికి అండగా నిలిచారని గుర్తు చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి తరలించడంలో ఆలస్యం కావడం వల్ల వెయిట్‌లాస్ అయి రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గతంలో



ప్రశ్నించిన నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు, రైస్‌మిల్లర్లు ఇప్పుడు కుమ్మక్కు అయ్యారా? అని నిలదీశారు. ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.

ఈ విషయమై జాయింట్ కలెక్టర్‌ను కూడా ఇటీవల కలిసి సమస్యలు వివరించానని చెప్పారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే రైతుల పక్షాన నిలబడి కొట్లాడుతానన్నారు. జీవన్‌రెడ్డికి ఇంకా ఎమ్మెల్సీగా ఏడాది పదవీ కాలం ఉన్నదని, ఓట్ల కోసం రైతుల కష్టాలు మరిచారని, హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# మట్టి, ఆస్తులు కొట్టేసిన ఘనుడు సిఎం జగన్

### –ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్టు చాలా దుర్మార్గమైనది

### – భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారు

### –టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

హైదరాబాద్ మే 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తాను సిఎంగా ఉన్నప్పుడు ఉచిత ఇసుక ఇచ్చానని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మట్టి, ఆస్తులు కొట్టేసిన ఘనుడు సిఎం జగన్ అని విమర్శించారు. ఉండి ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట చాలా దుర్మార్గమైందని, భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారని, మద్యంతోనే వేలాది కోట్ల రూపాయలు దోచేశారని, మద్యపానం రద్దు చేశాకే ఓట్లు అడుగుతానని జగన్ మోసం చేశారని దుయ్యబట్టారు. మీ భూములు కొట్టేయడానికి జగన్ సిద్ధమయ్యారని, ఫ్యానుకు, వైఎస్ఆర్‌సిపికి ఉరేయాలని పిలుపునిచ్చారు. న్యాయానికి, అన్యాయానికి జరిగే ఎన్నికలు ఇవి అని, కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేసే బాధ్యత నాది అని, రామరాజు సేవలు రాష్ట్రానికి అవసరమని తెలియజేశారు. రాష్ట్రాన్ని పాలించేది అహంకారి, దోపిడీదారి, సైకో, బందిపోటు జగన్ అని మండిపడ్డారు. ఎపి ప్రభుత్వాన్ని ఆర్ఆర్ఆర్ ప్రశ్నించినందుకు హింసించారని, ఆర్ఆర్ఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

### -పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా,నగర కాంగ్రెస్ అధ్యక్షులు



ఖమ్మం, మే 10 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి మాధవరావు ఆధ్వర్యంలో రమణగుట్ట (115 బూత్) ప్రాంత నివాసి తంగిరాల శ్రీకాంత్ (బన్ను) నేతృత్వంలో శీలం వివేక్, పెద్దపల్లి శ్రావణ్, గోగుల నాగేంద్రబాబు, సోమాపొంగు సతీష్, వత్సవాయి సతీశ్ గౌడ్, గుంపుల గోపి 350 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావీద్ లు కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ సంజీవరెడ్డి భవన్ లో జరిగింది. జిల్లా, నగర అధ్యక్షులు విడి విడిగా మాట్లాడుతూ... యువత రాహుల్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళుతు కాంగ్రెస్ ను బలపరచాలన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ...58వ డివిజన్ లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థికి మెజారిటీ ఓట్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు.

# బిజెపి కల్లబొల్లి మాటలకు మన పెద్దన్నలు మాదిగ జాతిని బిజెపికి తాకట్టు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం

### -బిజెపిని ప్రోత్సహిస్తే మనువాదాన్ని ప్రోత్సహించినట్లే..మనువాదంతో ఎస్సీ,బీసీ మైనార్టీలకు పొంచి ఉన్న ప్రమాదం

### –మాదిగ జాతీయ అభివృద్ధికి పాటుపడింది కాంగ్రెసే..

### –భవిష్యత్తులో కట్టుబడి పని చేసేది కాంగ్రెసే..

### -బిజెపికి,మోడీకి మాదిగ జాతి పెద్దన్నల జాతిని తాకట్టు మంచి పద్ధతి కాదని పరోక్షంగా మందకృష్ణ మాదిగకు సూచించారు

### –బిజెపి పార్టీకి ఓటేసి గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం కూడా మరో మణిపూర్ అవుతుంది

### -మాదిగ జాతీ యావత్తు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఖమ్మంజిల్లా ఎంపీఅభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### – కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ కోటా రాంబాబు

ఖమ్మం, మే 10 :(నేటినిజం ప్రతినిధి): దేశంలో రాష్ట్రంలో బిజెపిని ప్రోత్సహిస్తే మనమే మనువాదాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని దీనిని గమనించి మాదిగ జాతి యావత్తు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని శుక్రవారం స్థానిక కాంగ్రెస్ ఆఫీస్ నందు ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలియజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు మాదిగ జాతి అభివృద్ధిని చేసింది కాంగ్రెసే భవిష్యత్తులో మాటకు కట్టుబడి పనిచేసేది కాంగ్రెసే బిజెపి కల్లబొల్లి కబుర్లకు మాదిగ జాతి పెద్దన్నలు మోడీ దగ్గర కులాన్ని తాకట్టు పెట్టారని ఈ విషయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు కోటా రాంబాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు దళితులకు సేవ చేసిన పార్టీ కాంగ్రెస్సేనని ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తీసుకొచ్చి వారి అభివృద్ధికి తోడ్పడుతంతో పాటుగా అనేక సంక్షేమాలను కాంగ్రెస్ హయాంలో జరిగాయి అని తెలియజేశారు. ఎబిసిడి వర్గీకరణకు అనుకూలం అంటూ కమిటీల పేరుతో కాలయాపన చేసింది.



బిజెపి కామధేను లాంటి కాంగ్రెస్ పార్టీనీ వదిలేసి మనం సింహం లాంటి బిజెపి పార్టీ జూలు పట్టుకొని ప్రయాణిస్తే అది మనకే ప్రమాదమని మాదిగ జాతి బిడ్డలు ఆలోచించుకోవాలని వారు అన్నారు. మాదిగ జాతిలో ఉన్న క్రిస్టియన్లకు మోడీ ప్రభుత్వం వ్యతిరేకమని హిందుత్వం పేరుతో ఆనాడు దళితులను దేవాలయ ప్రవేశాన్ని నిషేధించిన మనువాదాన్ని మరల తీసుకొచ్చేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని...లౌకిక వాదానికి మోడీ విధానాలే వ్యతిరేకమని, మూడోసారి కేంద్రంలో బిజెపి పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఎవరూ కూడా లౌకికవాదులనే వారు ఉండరని, రాజ్యాంగబద్ధంగా నడుస్తున్న ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తున్న మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని దీని ద్వారా దళితులతో పాటు ముస్లిం మైనారిటీ వివిధ వర్గాల ప్రజల హక్కులను హరించకపోయే ప్రమాదం ఎంతైనా ఉందని డాక్టర్ కోటా రాంబాబు అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో యర్రగుంట రమేష్, మాజీ సర్పంచ్ లు కోట రామారావు, కొంగల ప్రసాద్, కటుకూరి శ్యామలరావు, బొబ్బిల్లపాటి బాబురావు, కోట దేవిడ్, పగిడిపల్లి దేవిడ్, పుట్టా పుల్లారావు, గుడిపాటి ఆనందరావు, మేకల రమేష్, చిలకా రాజేంద్ర, గుండ్ల రత్నబాబు, వేంపాటి ప్రభాకర్, ఇర్మియా, బొల్లెపోగు సత్యానందం, ఏసుపోగు విజయ్, గట్టిగుండే రవి, గద్దల కిరణ్, రెడపంగి యేసు, దుబ్బాసి బుజ్జి, గద్దల వెంకటేశ్వర్లు, కొమ్ము జీవానందం, గద్దల యశోద, ఊటుకూరి బాలకృష్ణ, చిలకా శివ, అప్పారావు తదితరులున్నారు.

# ఓటు హక్కును వినియోగిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం

## -కరాటే క్రీడాకారుల విన్యాసాలతో ఓటరు అవగాహన కార్యక్రమం



కరీంనగర్, మే 10 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ లోని గీత భవన్ చౌరస్తాలో జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతదేశంలో ఓటు వేయడం మన అందరి బాధ్యత అని, ఓటు హక్కు కల్గిన ప్రతీ ఒక్కరూ మే 13 వ తేదీన ఓటును వినియోగించుకోవాలని కోరుతూ స్లోగన్స్ తో ర్యాలీ నిర్వహించారు. అలాగే కరాటే విన్యాసాలతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షిహన్ ఇ శ్రీనివాస్ మాట్లాడుతూ బుల్లెట్ కంటే బలమైనది మన ఓటు అని, ఓటు ఖరీదు నోటు కాదని, మన ఐదు సంవత్సరాల భవిష్యత్ అని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఛైర్మన్ షిహన్ కె వసంత్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాడుగుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రసన్న కృష్ణా, జిల్లా ఉపాధ్యక్షులు పి శ్రీనివాస్ లు, కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు.

# సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

## -కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ కు మద్దతు



రాజన్న సిరిసిల్ల, 10 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ లేబర్ ఏరియా వద్ద, అగ్రహారం, ఇస్లాం నగర్ లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం లోక్ సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ గెలిచాల రాజేందర్ రావు గెలిపించాలని ప్రజలను కోరారు.

ఈ ప్రచారంలో సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు, సిపిఐ నాయకులు పండుగ పోషన్నలు, తదితరు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# 14నే సంక్షేమ పథకాలకు నిధులు విడుదల - హైకోర్టు

విజయవాడ మే 10 :ఎపి సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్మును లబ్దిదారాల ఖాతాల్లో ప్రభుత్వం డీబీటీ ద్వారా నగదు జమ చేయటంపై రాష్ట్ర హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 14వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసుకోవచ్చని గతంలో ఇచ్చిన ఎన్నికల కమిషన్ ఆదేశాలను కొనసాగిస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

ఇవాళ ఒక్కరోజు నగదు బదిలీ చేసేందుకు వెసులుబాటు ఇస్తూ.. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు సవాలు చేస్తూ నేడు దాఖలైన పిటిషన్ పై డివిజన్ బెంచ్ లో విచారణ సాగింది.. అయితే, ఈ నెల 13న పోలింగ్ ఉన్న కారణంగా తర్వాత రోజున డీబీటీ ద్వారా నగదు బదిలీ చేసుకోవాలనీ గతంలోనే ఈసీ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఆ ఆదేశాలను కొనసాగిస్తూ ఈ నెల 14వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసుకోవచ్చని ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

ఇక, డిబిటి ద్వారా నగదు జమ చేయటానికి హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు సవాలు చేస్తూ డివిజన్ బెంచ్ లో పిటిషన్ దాఖలు కాగా.. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా లబ్ధిదారుల ఎంపిక జరగలేదని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.. ఇప్పుడు కేవలం నగదు ట్రాన్స్ ఫర్ చేయటం మాత్రమే చేస్తున్నాం.. ఇవన్నీ పాత పథకాలు తప్ప కొత్తవి కావన్నారు.. సింగిల్ బెంచ్ ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఈసీ తమకు క్లారిటీ ఇవ్వలేదన్నారు.. ఎన్నికల కమిషన్ క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల మేం ఇంకా నిధులు విడుదల చేయలేదని.. గతంలో 2019లో పసుపు కుంకుమ కోసం పోస్ట్ డిటెడ్ చెక్కులు ఇవ్వటం జరిగిందని గుర్తుచేశారు. కానీ, ఈ నెల 14వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసుకోవచ్చని గతంలో ఇచ్చిన ఎన్నికల కమిషన్ ఆదేశాలను కొనసాగిస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

# కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు



రాజన్న సిరిసిల్ల, 10 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ పరిధిలోని శత్రారాజ్ పల్లి కి చెందిన మాజీ ఉప సర్పంచ్ రేగుల రాజేశం, సవణపల్లి జీవన్, చంద్రం శ్రీనివాస్, గుడిసె పవన్ కుమార్ , ముదిరాజ్ సంఘ సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని కొన్ని అనివార్య కారణాలవల్ల ఇతర పార్టీలోకి వెళ్లడం జరిగిందని, తిరిగి సొంత ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వచ్చి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరడం జరుగుతుందన్నారు. దేశంలో మూడు విడుతల ఎన్నికలు పూర్తయ్య సరికి కాంగ్రెస్ పార్టీ అధికారం దిశగా వెళుతుందన్నారు. దేశంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పేద ప్రజలు బాగుపడాలన్న కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అవుతుంద న్నారు.మొన్నటి రోజున మోడీ వేములవాడ కు వచ్చి రాజన్నను దర్శించుకుంటే ఆ స్వామివారికి ఎంతో కొంత నిధులు ఇస్తాడు అనుకున్నాం కానీ మొండి చేయి చూపి వెళ్ళిపోయా రన్నారు. గతంలో కేసీఆర్ నా లగ్గం ఇక్కడే అయింది, ఏటా 100 కోట్లు ఇస్తానని ఏ విధంగా అయితే మోసం చేశారో మోడీ కూడా అలాగే చేశారు. హిందుత్వ ఎజెండా తో ముందుకు పోతున్న బిజెపి వారికి మ రాజన్న కు నిధులు ఎందుకు ఇవ్వలేదు.

కేంద్రంలోని ప్రసాద్ పథకం ద్వారా రాష్ట్రంలో జోగులాంబ దేవాలయనికి ఇస్తారు, రామప్ప దేవాలయనికి ఇస్తారు కానీ మా రాజన్న కు ఒక్క రూపాయి కూడా తేని ప్రస్తుత పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు..

ఉత్తర కాశీ లో పోటీ చేసి గెలిచిన మోడి దక్షణ కాశీ వేములవాడ రాజన్న సన్నిధికి వస్తె గుడి అభివృద్ధి కోసం నిధులు ఇస్తాడు అనుకుంటే ఉట్టి చేతులతో వెళ్ళాడు. మోడీ కేవలం ఓట్ల కోసమే వేములవాడకు వచ్చాడని మన ప్రాంతంపై ప్రేమ కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వెలిచాల రాజేందర్ రావు ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్,నాయకులు లింగంపల్లి కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితులున్నారు.

# తెలంగాణలో నేటితో ముగియనున్న లోక్ సభ ఎన్నికల ప్రచారం

హైదరాబాద్: తెలంగాణలో 17 స్థానాలకు లోక్ సభ ఎన్నికలు మే 13న జరుగనున్నాయి. అయితే ఎన్నికల ప్రచారం మటుకు శనివారంతో ముగియనున్నది. సాధారణంగా పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుంది. అయితే ఇటీవల టైమింగ్ కాస్త చేంజ్ అయింది. రాష్ట్రంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్ జరుగనున్నది. తెలంగాణ రాష్ట్రంలో వీలయినంత మేరకు ఎక్కువ సీట్లు గెలువాలని కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ పట్టుగా ఉన్నాయి. అయితే ప్రజల నాడి ఇప్పుడప్పుడే తెలియదు కదా ! ఇక తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాలు ఇవే: ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీం నగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్(ఎస్సీ), నల్గొండ, భువనగిరి, వరంగల్, మహబూబాబాద్(ఎస్టీ), ఖమ్మం. హైదరాబాద్ లో మజ్లీస్ నాయకుడు అసదుద్దీన్ ఓవైసీని ఓడించాలని బిజెపి అభ్యర్థి మాధవీ లత అన్ని విధాల ప్రయత్నిస్తోంది. ఏది ఏమైనప్పటికీ రేపటితో ప్రచారం ఖతం.

# వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం



రాజన్న సిరిసిల్ల, 10 :(నేటినిజం ప్రతినిధి): పార్లమెంటు ఎన్నికల సందర్భంగా వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి , గాంధీనగర్ , జాతర గ్రౌండ్ ఏరియాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు ,

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో నాయకులు వంగల శ్రీనివాస్,పులి రాంబాబు గౌడ్ ,తోట రాజు, బొందిల మహేష్, అంబటి చందు, ముంజ ఉమేందర్ , తదితరులు పాల్గొన్నారు...

# కాంగ్రెస్ పార్టీ ద్వారానే యాదవ, కురుమలకు గుర్తింపు

## - రఘురాం రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలి
## - డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,మొగిలి అప్పారావు

ఖమ్మం, మే 10 :(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ద్వారానే కురుమ యాదవులకు గుర్తింపు వచ్చిందని, కురుమ యాదవులు



ఏకతాటిపై కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని, హస్తం గుర్తుకి ఓటేసి రామసహాయం రఘురాంరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా డిసిసిబి డైరెక్టర్ అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎర్రుపాలెం మండల కేంద్రంలో మొగిలి అప్పారావు అధ్యక్షతన జరిగిన మండల యాదవ సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి గొర్రెలు ఇస్తానని పట్టణ ప్రాంతాలలోని కురుమ, యాదవులకు పాడి గేదెలు ఇస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కెసిఆర్ కేంద్రం నుంచి వచ్చిన ఎన్సీడీసీ నిధులను గొర్రెల పంపిణీ పథకన్ని మళ్లించి తెలంగాణలో 50లక్షల మంది ఉన్న కురుమ,యాదవులకు దేవుని ప్రసాదం లాగా కేవలం మూడు లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకొని నమ్మకద్రోహం చేశాడని విమర్శించారు. కురుమ,యాదవుల్ని గొర్రెల సంఘాలుగా గుర్తించింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని, ఫెడరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఎన్సిడిసి ద్వారా రుణాలు ఇప్పించింది, మన ఖమ్మం జిల్లాలో ఆరు కోట్ల రూపాయలు ఎలాంటి దళారీ వ్యవస్థ ప్రమేయం లేకుండా మంజూరు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, జీవో నెంబర్ 559 1016 జీవోల ద్వారా చెరువు శిఖం భూములు లోతట్టు ప్రాంతాలు గొర్రెల మేత కొరకు అప్పగించాలని, ప్రతి గొర్రెకు బీమా సౌకర్యం కల్పించింది, ప్రమాదవశాత్తు చనిపోయిన లక్ష రూపాయలు ఎక్స్గ్రేషియా ఇప్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. దేశంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని, మన అందరివాడు పొంగులేటి శీనన్న వియ్యంకుడు, సౌమ్యుడు రఘురాం రెడ్డిని గెలిపించుకుంటే మళ్లీ కేంద్రం నుండి నిధులు తెప్పించుకోవచ్చని, ఎన్.ఎల్.ఎమ్ లాంటి స్కీములకు కురుమ,యాదవులకు ఎలాంటి బ్యాంకు గ్యారంటీ లేకుండా నిధులు తెప్పించే ఏర్పాటు చేయవచ్చని మల్లిబాబు యాదవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాగదాని శంకర్రావు, నన్నెపోయిన నాగరాజు, దాసరి మల్లయ్య, మట్టు కృష్ణ, పోతుమర్రి నాగేశ్వరరావు, దానరి రమేష్, కేతబోయిన నాగేశ్వరరావు, మార్త భద్రయ్య, బండారు యాదాద్రి, దుద్దుకూరు తిరుపతిరావు, బుర్ర నారాయణ, ఆర్ నాగరాజు, తదితరులున్నారు.

# మల్లారంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



రాజన్న సిరిసిల్ల, 10 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజక వర్గంలోని మల్లారం గ్రామంలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ,కారు గుర్తుకు ఓటు వేసి బోయినపల్లి వినోద్ కుమార్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గోస్కుల రవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఎంపీటీసీ తిరుపతి, తాజా మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవరాజు గౌడ్, పసుల అంజి, ప్రవీణ్ గౌడ్, దేవయ్య తదితరులు ఉన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు మతిభ్రమించింది

## -బండి సంజయ్ పై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
## -కాంగ్రెస్ అభ్యర్థి జనంలో ఉండని నాయకుడు..
## -కాంగ్రెస్ లో అంతర్గత కుమ్మలాటలు , రాజకీయలు ఎక్కువయ్యాయి..
## -బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు...



కరీంనగర్, మే 10 : (నేటినిజం ప్రతినిధి) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిన్నటి రోజున కరీంనగర్ లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ సందర్భంగా బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ పై అవాకులు చివాకులు పేలారని, దీన్ని పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, ముఖ్యమంత్రి ఉద్యోగం కోల్పోయిన కెసిఆర్ కు పతిభ్రమించి పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు భాస సత్యనారాయణ రావు విమర్శించారు. శుక్రవారం కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు, ఆయన పార్టీ బిఆర్ఎస్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్పి గద్దె దించిన వాళ్ల తీరు మారలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అసత్య ప్రచారాలు చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ దాదాపు 12,000 వేల కోట్ల నిధులు ప్రజా సంక్షేమం, ఇతర అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చారన్నారు . కళ్ళు ఉండి చూసేవారికి చేసిన అభివృద్ధి పనులు కరీంనగర్ పార్లమెంటు వ్యాప్తంగా కళ్ళముందే కనబడతాయని, కళ్ళు ఉన్నా కూడా నటించే వారికి ఆ పనులు కనిపించవన్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెలియని పరిస్థితి పార్లమెంటు పరిధిలో ఉందన్నారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి , చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకుందామనే ప్రయత్నంలో ఉన్నాడని, కాంగ్రెస్ అభ్యర్థి ఏ నాడు ప్రజల్లో లేడన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రజల పక్షాన ఏనాడూ నిలబడలేదని, కేవలం తన రాజకీయ అవసరాల కోసం గతంలో పిఆర్పి నుండి ఎంపీగా పోటీ చేసి కనబడకుండా పోయారని విమర్శించారు. తిరిగి ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్నికల బరిలో ఎంపీ అభ్యర్థిగా నిలిచారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రజల కోసం ఇన్నేళ్లలో ఏమైనా సేవ చేశారా..? కష్టాల్లో ఉన్న ఎప్పుడైనా ఆదుకున్నారా..? ప్రజలంతా ఆలోచన చేయాలన్నారు. కేవలం తన రాజకీయ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారే తప్ప ప్రజా సమస్యలపై గాని, పార్లమెంటు పరిస్థితులపై గాని ఏమాత్రం అవగాహన లేదన్నారు. అలాంటి వ్యక్తికి ఓటు వేయడం దండుగా అనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్లో అంతర్గత కుమ్ములాటలు, రాజకీయాలు ఎక్కువ అని, అందుకే కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి పురమళ్ళ శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి లు దూరమయ్యారని తెలిపారు. పార్టీ వ్యవహారాలనే చక్కదిద్దుకోనొళ్ళు ప్రజల సమస్యలను ఏం పరిష్కరిస్తారు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. కాంగ్రెస్ రోజురోజుకి ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని కోల్పోతుం దన్నారు. జరగబోయే పార్లమెంటు ఎన్నిక లో వార్ వన్ సైడ్ జరగను ందని, బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని ఆయన ఈ సంద ర్భంగా తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధి సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర, సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పర పల్లి శ్రీనివాస్ ,నాయ ుకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కునుసద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ రోహిత్ రాజు

## - కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న జిల్లాఎస్పీ



ఖమ్మం, మే 10 :(నేటినిజం ప్రతినిధి): లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుండి కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ నందు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ పాల్గొన్నారు. ఈ నెల 13వ తేదీన జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ నకు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరు గుతుందని అన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమా వళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగు తుందని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో సుమారుగా అధికారు లు, సిబ్బంది కలిసి మొత్తం 200మ ంది పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ట్రైనీ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ రాజు, సీఐలు, ఎస్సైలు, పాల్గొన్నారు.

# ఎన్నికలు భారత్లో జరుగుతుంటే చర్చ పాకిస్థాన్ మీద ఎందుకు..?: ప్రియాంకాగాంధీ

న్యూఢిల్లీ, మే 10 :ఎన్నికలు భారత్లో జరుగుతుంటే చర్చ పాకిస్థాన్ మీద ఎందుకుని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగిత రేటు 45 ఏళ్ల గరిష్టానికి చేరిందన్నారు. పాలక బీజేపీ దేశంలోని వాస్తవ సమస్యలపై ఎన్నికల ప్రచారంలో మాట్లాడాలని హితవుపలికారు. అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీలాల్ శర్మ తరఫున ప్రచారం సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలపై స్పందించారు. ఆ ప్రకటన పాతదని, ఇప్పుడు మనం దాని గురించి ఎందుకు చర్చిస్తున్నామని ప్రశ్నించారు. ఎన్నికలు జరుగుతున్నది భారత్లోనా లేదంటే పాకిస్థాన్లోనా అని ప్రశ్నించారు. భారత్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు పాకిస్థాన్ గురించి ఎందుకు మాట్లాడాలని క్వశ్చన్ చేశారు.

ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ హిందూ ముస్లిం అంశంపై వ్యాఖ్యలు చేస్తోందని.. కానీ ప్రజలు కులం, మతం ప్రాతిపదికన ఎన్నికలు జరగాలని కోరుకోవడం లేదని ప్రియాంకా గాంధీ అన్నారు. నిరుద్యోగం రేటు 45 ఏళ్ల గరిష్టానికి చేరిందని, ద్రవ్యోల్బణం పెరిగిందని విమర్శించారు. ధరలు పెరిగిపోవడంతో ప్రజలు తమకు అవసరమైన వాటిలో సగం కూడా కొనుగోలు చేయలేక పోతున్నారని చెప్పారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com